క్లుప్తంగా

నేడు స్పందన, డయల్ యువర్ కమిషనర్



కమిషనర్ వెంకటరావు

కాకినాడ: ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం ఉదయం 9:30 నుంచి 10:30 వరకు డయల్ యువర్ కమిషనర్ నిర్వహిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు చెప్పారు. స్థానిక సమస్యలను కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయానికి 0884 2357800కు కాల్ చేసి తెలియజేయవచ్చునన్నారు. ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ చెప్పారు. అలాగే 10:30 నుంచి స్పందన యథావిధిగా కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యాలయం వరకు రాలేని వారు స్థానికంగా ఉండే సచివాలయాల్లో కూడా సమస్యలు తెలియజేయవచ్చునన్నారు.

భద్రాద్రికి తరలిన శ్రీరామ రథోత్సవ పాదయాత్ర



భోగిగణపతి పీఠంలో పూజలు చేస్తున్న వాసుదేవ గురుస్వామి

బోట్‌క్లబ్: కాకినాడ స్వయంభూ భోగి గణపతి పీఠం నుంచి 2012లో ఇద్దరితో ప్రారంభమైన భద్రాచల పాదయాత్ర 400 మందితో 13వ ఏట నిర్విఘ్నంగా జరగడం అదృష్టమని వాసుదేవ గురుస్వామి అన్నారు. ఆదివారం ఉదయం స్థానిక పీఠంలో బ్రహ్మ ముహూర్తంలో తొలిపూజ చేసి అచ్చంపేట నుంచి గొంచాల మీదుగా కాలినడకన శ్రీరామ రథం లాగుతూ సామర్లకోట జాతీయ రహదారిపై భద్రాచలం తరలి వెళ్లారు. వాసుదేవ గురుస్వామి మాట్లాడుతూ 13వ వార్షిక యాత్ర 10 రోజుల్లో పూర్తి చేసి భారీ అన్న సమారాధన చేస్తామన్నారు. కార్యక్రమంలో సమితి గౌరవ అధ్యక్షుడు వింటి బాబ్జీ అధ్యక్షులు పేర్నీడి వెంకటరమణ వెంకటేశ్వరరావు, సభ్యులు శ్రీనివాస్, సత్యనారాయణ, సత్యప్రసాద్, వీరభద్రరావు, సూర్యనారాయణ పాల్గొన్నారు.

చిల్లర మాటలు మాట్లాడకండి

- ఉండవల్లిపై బీజేపీ నాయకుల ధ్వజం



ఉండవల్లిపై ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు

బోట్‌క్లబ్: మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ చిల్లర మాటలు మానుకోవాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి యార్లగడ్డ రాం కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. భారతరత్న అవార్డు వచ్చిన అద్వానీ టోల్ ఫీజులు కట్టనవసరం లేదనడం ఆయన స్పృహలో ఉండే మాట్లాడారా అని ప్రశ్నించారు. ఉండవల్లిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కాకినాడ టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం బీజేపీ నాయకులు ఫిర్యాదు చేశారు. భారతరత్న అనేది దేశ అత్యున్నత పురస్కారమని, అటువంటి పురస్కారంపై ఇటువంటి వ్యాఖ్యలు చేయడం తగదని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీలోని మాజీ ప్రధానులు, స్వర్గస్థులైన జవహర్ లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ కూడా ఉన్నారని, ఇది కూడా మరచి తానూ మేధావినేనని ఎలా అనిపించుకుంటారన్నారు. బీజేపీ నాయకులు పైడ భావన ప్రసాద్, మాలకొండయ్య, దువ్వూరి సుబ్రహ్మణ్యం, గౌతు చిన్నారావు పాల్గొన్నారు.

నిరుపేదలకు కార్పొరేట్ వైద్యమే లక్ష్యం



వైద్య శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

తాళ్లరేవు: గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదలకు కార్పొరేట్ వైద్యసేవలు అందించాలన్నదే నవభారత్ గ్రామీణాభివృద్ధి చారిటబుల్ ట్రస్ట్ ముఖ్య ఉద్దేశమని ట్రస్ట్ చైర్మన్ అంగాడి రేవతి తెలిపారు. ఆదివారం తాళ్లరేవు అంబేడ్కర్ భవన్‌లో ట్రస్ట్ ఆధ్వర్యంలో కాకినాడ అపోలో ఆస్పత్రి వైద్యుల సహకారంతో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ప్రముఖ వైద్యులు సాజిత్ కిషన్(కార్డియాలజిస్ట్), వంశీ చైతన్య(గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్), అనూష చౌదరి(జనరల్ మెడిసిన్), అభిషేక్ రావూరి, ఆశా ఐశ్వర్య(డెంటల్ సర్జన్‌లు) సుమారు 500 మందికి వైద్య సేవలందించారు. జనరల్ చెకప్ బీపీ, షుగర్ పరీక్షలతో పాటు కంటి, చెవి, డెంటల్ తదితర పరీక్షలు నిర్వహించారు. అనంతరం అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేసారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులతో పాటు స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

పేదలు ఇక పట్టాభద్రులు

- జగనన్న ఇచ్చిన స్థలాలకు చురుగ్గా రిజిస్ట్రేషన్లు
- 31 వేల మంది లబ్ధిదారులకు ప్రయోజనం

పేద ప్రజలకు ప్రభుత్వం మరో శుభవార్త చెప్పింది. ప్రభుత్వం ద్వారా ఇచ్చే ఇళ్ల పట్టాలపై లబ్ధిదారులకు శాశ్వత హక్కు కల్పించేదిదిశగా మరో ముందడుగు వేసింది. నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో ఇచ్చిన ఇళ్ల స్థలాలను రిజిస్ట్రేషన్ చేసి లబ్ధిదారులకు అప్పగించనుంది. ఈ దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీసుకున్న నిర్ణయం ఇళ్ల స్థలాల లబ్ధిదారుల్లో సంతోషాన్ని నింపుతోంది.





లబ్ధిదారు పేరున రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల పంపిణీ చేసిన ఇంటి స్థలం పట్టా

కాకినాడ: పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడమే కాదు వాటిపై పూర్తి హక్కు కల్పించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయించారు. ఆ మేరకు నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ళు పథకంలో ఇచ్చిన ప్రతి ఇంటి స్థల పట్టాను పక్కాగా రిజిస్ట్రేషన్ చేసి లబ్ధిదారులకు ఇవ్వాలనే కీలక నిర్ణయం తీసుకున్నారు. ఆ మేరకు ప్రభుత్వ యంత్రాంగం రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభించి ప్రభుత్వ విధానపరమైన నిర్ణయాన్ని అమలులోకి తెచ్చేలా చకచకా ఏర్పాట్లు చేస్తోంది.

31 వేల మందికి రిజిస్ట్రేషన్లు

కాకినాడ సిటీ నియోజకవర్గంలో దాదాపు 31వేల మందికి ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లతో భూ హక్కు బదలాయింపు ప్రక్రియ జరగనుంది. వాస్తవానికి కాకినాడ సిటీలో దాదాపు 750 ఎకరాల స్థలాన్ని సేకరించి 12 లే అవుట్లలో లబ్ధిదారులను ఎంపిక చేశారు. స్థలాల కొనుగోలు, చదునుచేసే ప్రక్రియ, మౌలిక సదుపాయల కల్పనతో కలిపి సుమారు రూ.750 కోట్లు విలువైన ఇంటిస్థలాలను ఇప్పటికే పేదలకు అందజేశారు. ఇంత విలువైన స్థలాలకు గతంలో ఉండే నిబంధనల ప్రకారం కేవలం అనుభవించే హక్కు మాత్రమే ఉండేది. ఇప్పుడు పూర్తిస్థాయిలో లబ్ధిదారులకు బదలాయించి రిజిస్ట్రేషన్ చేయడం వల్ల ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా కొన్నేళ్ల తరువాత ఆ స్థలంపై సంపూర్ణహక్కును పొందగలిగే అవకాశం ఏర్పడుతోంది.

వీఆర్వోలతో రిజిస్ట్రేషన్లు

రిజిస్ట్రేషన్ల ప్రక్రియను ఆయా సచివాలయ పరిధిలోని వీఆర్వోలే ప్రభుత్వం తరపున పూర్తి చేయనున్నారు. ఇందుకు సంబంధించిన నియమ నిబంధనలు ఇప్పటికే జిల్లా కేంద్రానికి చేరాయి. ఒకటి రెండు రోజుల్లో ఈ ప్రక్రియ వేగవంతం కానుందని నగరపాలక సంస్థ అధికారులు చెబుతున్నారు. ఇలా రిజిస్ట్రేషన్లు చేసి అప్పగిస్తే సదరు ఇంటి స్థలంపై లబ్ధిదారులకు శాశ్వత హక్కు కలగనుంది.

పేదల పక్షాన ప్రభుత్వ నిర్ణయం



ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థలాలకు రిజిస్ట్రేషన్లు చేయాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపాదనతో లక్షలాది మంది లబ్ధిదారులకు శుభవార్తే కాగలదు. భవిష్యత్‌లో కుటుంబ అవసరాల కోసం సదరు స్థలాన్ని తాకట్టు పెట్టాలన్నా, వారసులకు బదలాయించుకోవాలన్నా, వేరొకరికి బదిలీ చేసుకునే హక్కు ఈ రిజిస్ట్రేషన్ల వల్ల కలుగుతుంది.

– ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, సిటీ ఎమ్మెల్యే

రిజిస్ట్రేషన్లకు ఏర్పాట్లు



నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో ఇచ్చిన ఇళ్ల పట్టాలకు త్వరలోనే రిజిస్ట్రేషన్ల ప్రక్రియ కూడా ప్రారంభం కాబోతుంది. ఇందుకు సంబంధించి ఆయా సచివాలయాల ద్వారా వీఆర్వోలకు అవసరమైన ఆదేశాలు ఇవ్వడం జరిగింది. ఆయా సచివాలయాల పరిధిలోని లబ్ధి దారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి.

– జి.వెంకటరావు, కమిషనర్, నగరపాలక సంస్థ

నేడు కరపలో ఎమ్మెల్యే కన్నబాబు పర్యటన

కరప: గ్రామంలో సోమవారం ఎమ్మెల్యే కురసాల కన్నబాబు స్థానిక నాయకులతో పర్యటించి పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేస్తారని ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు తెలిపారు. సీతమ్మవీధిలో మహాత్మ జ్యోతిరావు పూలే శెట్టిబలిజ కళ్యాణమండపానికి, సామూహిక తాగు నీటి చెరువుచుట్టూ నిర్మించిన వాకింగ్ ట్రాక్‌ను ఆయన ప్రారంభిస్తారని తెలిపారు. కురసాల సురేష్‌బాబు జ్ఞాపకార్థం ఆయన తండ్రి, నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ సమకూర్చిన రూ 1.1 లక్షలతో నిర్మించిన సంఘసంస్కర్త మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరిస్తారని నిర్వాహకులు తెలిపారు.

సేవకులకు ఘన సత్కారం

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి ఇంటింటికీ భోజనం అందించి సేవలు చేసిన మిత్రులను హరీష్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం సత్కరించారు. స్థానిక కాస్మో క్లబ్‌లో హరీష్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తలాటం హరీష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ తిరుపాణ్యం, డాక్టర్ కిరణ్, డీఎస్‌టీఓ శ్రీనివాసరావు, బాపిరాజు, అడ్డాల సత్యనారాయణ, సీహెచ్ రామ్‌కుమార్, ఆర్.రాఘవరావు, కోనసీమ యువరాజులు అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా హరీష్ మాట్లాడుతూ కరోనా సమయంలో రోజుకు 300 మంది కరోనా రోగుల ఇళ్లకు వెళ్లి వలంటీరీగా తన మిత్రులు భోజనం అందించి, వారికి కావల్సిన మందులు అందించేవారన్నారు. కరోనా కాలంలో చేసిన సేవలకు గుర్తింపుగా ట్రస్ట్ తరఫున సత్కరించడం హర్షణీమని వారు పేర్కొన్నారు

తహసీల్దార్ శ్రీనివాసరావుకు సత్కారం



తహసీల్దార్ శ్రీనివాసరావును సత్కరిస్తున్న మండల వీఆర్వోలు, సర్వేయర్లు, సిబ్బంది

కరప: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఇటీవల బదిలీ అయిన తహసీల్దార్ పి.శ్రీనివాసరావును ఆదివారం కార్యాలయం సిబ్బంది, మండల వీఆర్వోలు, సర్వేయర్లు, మండల అధికారులు సత్కరించారు. ఎన్నికల బదిలీలలో భాగంగా ఆయన కాకినాడ కలెక్టరేట్‌లోని మెజిస్టీరియల్ సెక్షన్‌కు బదిలీ అయ్యారు. నాలుగున్నరేళ్లలో డిప్యూటీ తహసీల్దార్‌గా, తహసీల్దార్ అందించిన సేవలకు గుర్తింపుగా సిబ్బంది, ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. సన్మానగ్రహీత శ్రీనివాసరావు మాట్లాడుతూ విధి నిర్వహణలో వీఆర్వోలు, సర్వేయర్లు, సిబ్బంది, ఇతర మండల స్థాయి అధికారులు అందించిన సహకారంతో టీమ్‌గా పనిచేసి మండలాన్ని ముందంజలో ఉంచగలిగామన్నారు. మండల సర్వేయర్ ఈ.రామకృష్ణ స్వాగతం పలికి, వందన సమర్పణ చేశారు. డీటీ కె.అనిల్‌కుమార్, రీసర్వే డీటీ సురేష్, ఆర్ఐ పేపకాయల మాచరావు, ఎంపీఓ ఏవీ రాజేష్, విద్యుత్‌శాఖ ఏఈ సానా ఈశ్వరప్రసాద్, ఏఎస్ఐ వి.సూరిబాబు, జిల్లా వీఆర్వోల సంఘం మాజీ అధ్యక్షుడు చాగంటి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌ను పారదోలాలి



సర్పవరం జంక్షన్‌లో నిర్వహిస్తున్న క్యాన్సర్ నిర్మూలన అవగాహన ర్యాలీ

కాకినాడ రూరల్: సమాజం నుంచి క్యాన్సర్‌ను పారదోలాలని ఏఎస్పీ సత్యనారాయణ పిలుపునిచ్చారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా ఆదివారం సర్పవరం జంక్షన్‌లో ట్రినిటీ హాస్పటల్ ఆధ్వర్యంలో విద్యార్థులతో నిర్వహించిన ర్యాలీలో ఏఎస్పీ సత్యనారాయణ, జీజీహెచ్ క్యాన్సర్ విభాగం హెచ్‌ఓడీ శ్రీనివాసులు ముఖ్యఅతిథిలుగా పాల్గొని క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. అనంతరం భానుగుడి వరకు ర్యాలీ నిర్వహించారు. వైద్యులు కౌశిక్, విజయ్‌బాలు, యాళ్ళ రాజా, ముత్యాల మురళీ, అడబాల సత్యనారాయణ, పేకేటి శైలేంద్ర డైరెక్టరు పేకేటి శైలేంద్ర కిశోర్ పాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో..

కాకినాడ రూరల్: ప్రాథమిక దశలో క్యాన్సర్‌ను గుర్తిస్తే నివారణ సాధ్యమవుతుందని డాక్టర్ అడ్డాల సత్యనారాయణ పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్‌లో బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, రాఘవరావు, తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాల నిర్వహణకు చురుగ్గా చర్యలు



స్థలాన్ని చదును చేస్తున్న సిబ్బంది



సేకరించిన స్థలం వద్ద బోర్డు ఏర్పాటు చేసిన కార్పొరేషన్

- స్థలాన్ని అభివృద్ధి చేస్తున్న కార్పొరేషన్
- ఇది డంప్ యార్డు కాదన్న అధికారులు

కాకినాడ: నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ మార్గదర్శకాలకు అనుగుణంగా ఘన వ్యర్థ, మురుగు నీటి జలాల నిర్వహణ దిశగా నగరపాలక సంస్థ శ్రీకారం చుట్టింది. వీటికోసం ఇటీవలే ఓ ప్రైవేటు సంస్థ నుంచి టీడీఆర్ బాండ్ల ద్వారా ఐదు ఎకరాల స్థలాన్ని సేకరించిన కార్పొరేషన్ ఇప్పుడు ఆ స్థలాన్ని అభివృద్ధి చేసే దిశగా చర్యలు చేపట్టింది. కార్పొరేషన్‌కు చెందిన హుపర్ టిప్పర్, జేసీబీలు వంటి వాహనాల కోసం వెహికల్ యార్డుతో పాటు గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్, వ్యర్థజలాలను శుద్ధి చేసేలా ప్లాంట్ ఏర్పాటు, పొడిచెత్తను ప్రాసెసింగ్ చేసే విధానం వంటి కార్యకలాపాలను అక్కడ చేపట్టనున్నారు. ఆ మేరకు అవసరమైన యూనిట్లను ఏర్పాటు చేసే దిశగా తొలుత స్థలాన్ని చదును చేస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తయిన వెంటనే వ్యర్థాల నిర్వహణ ప్రక్రియను వేగవంతం చేయనున్నట్టు అధికారులు తెలిపారు. కాగా ఇక్కడ వ్యర్థాల నిర్వహణ మాత్రమే జరుగుతుందని, చెత్తను డంపింగ్ చేయబోరని అధికారులు స్పష్టం చేశారు. కాగా సేకరించిన స్థలం నగరపాలక సంస్థదిగా పేర్కొంటూ అక్కడ బోర్డులు కూడా ఏర్పాటు చేశారు.

క్లెయిములు మంజూరు చేయాలి

కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్స్ నిధులు తక్షణం మంజూరు చేయాలని ది కాకినాడ జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ సమావేశం డిమాండ్ చేసింది. ఈ సమావేశంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్, పీజీఆర్ కుమార్ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు భద్రత కరువైందన్నారు. ఈ సమావేశంలో టి.అన్నవరం, శ్రీను, పి.శివ, అచ్చారావు, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పు భూములు స్థానికులకే ఇవ్వాలి

తాళ్లరేవు: మండల పరిధిలోని చొల్లంగిలో 47/3 సర్వే నెంబరులోని సాల్ట్ భూములను కాకినాడ వాసులకు కేటాయించడం సరికాదని, ఆ భూములను స్థానికులకే ఇవ్వాలని కోరుతూ గ్రామస్తులు ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో చొల్లంగి భూములను స్థానికులకే ఇవ్వాలని నినాదాలు చేశారు. ఇదే డిమాండ్‌తో స్థానికులు కొద్దిరోజులుగా నిరసన దీక్షలు చేస్తున్నారు. ఈ సందర్భంగా స్థానిక నాయకుడు కట్టా త్రిమూర్తులు మాట్లాడుతూ చొల్లంగి గ్రామ లబ్ధిదారులకు పటవల, జి.వేమవరంలో ఇచ్చి చొల్లంగిలో ఉన్న భూములను మాత్రం కాకినాడ వాసులకు కేటాయించడం దారుణమన్నారు.

ఇకనైనా అధికారులు స్పందించి చొల్లంగిలో భూములను స్థానికులకే కేటాయించాలని డిమాండ్ చేశారు.



చొల్లంగి భూములను స్థానిక లబ్ధిదారులకే కేటాయించాలని ర్యాలీ చేస్తున్న గ్రామస్తులు

చికిత్స పొందుతూ ఇద్దరి మృతి

కాకినాడ రూరల్: మండలంలోని తూరంగి గ్రామానికి చెందిన నడకిడిమిల్లి ధనరాజు వర్మ (18) కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఇంద్రపాలెం పోలీసులు తెలిపిన వివరాల మేరకు చదువు మధ్యలో మానేసి పెట్రోల్ బంక్‌లో పనిచేస్తున్న ధనరాజు వర్మ శనివారం తూరంగి ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. స్థానికులు, కుటుంబ సభ్యులు అతడిని జీజీహెచ్‌లో చేర్చారు. చికిత్స పొందుతూ మృతి చెందడంతో తండ్రి ధనరాజు ఫిర్యాదు మేరకు హెచ్‌సీ సుబ్రహ్మణ్యం కేసు నమోదు చేశారు. ఎస్సై మణికుమార్ దర్యాప్తు చేస్తున్నారు.

కాలిన గాయాలతో మరొకరు..

మండలంలోని గంగనాపల్లి గ్రామానికి చెందిన పాలూరి బాల సుబ్రహ్మణ్యం(32) కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ నెల 29న సిగరెట్ తాగుతూ జాగ్రత్తలు తీసుకోకుండా బైక్‌లో పెట్రోల్ పోస్తున్నాడు. ఇంతలో అతడిపై ఒక్కసారిగా మంటలు వ్యాపించి తీవ్రంగా గాయపడ్డాడు. కారు డ్రైవర్‌గా పని చేస్తున్న అతడు మృతి చెందడంతో ఏఎస్సై సూర్య ప్రకాశరావు ఆదివారం కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడి మృతి

మండలంలోని తూరంగి గ్రామంలో శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన తాళ్లరేవు మండలం సుంకటరేవుకు చెందిన యువకుడు దడాల అమర్ తేజ (26) కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఇంద్రపాలెం పోలీసుల వివరాల ప్రకారం కాకినాడలో ఆస్పత్రికి అమర్ తేజ తన తండ్రి ఈశ్వరరావుతో మోటారు సైకిల్‌పై వచ్చాడు. సాయంత్రం తిరుగు ప్రయాణంలో తండ్రి బైక్ నడుపుతుండగా వెనక అమర్ తేజ కూర్చున్నాడు. తూరంగిలో బాలయోగి విగ్రహానికి సమీపానికి వచ్చే సరికి ఒక్కసారిగా కుక్క బైక్‌కు అడ్డం రావడంతో ఇద్దరూ కింద పడిపోయారు. అమర్‌తేజ తలకు బలమైన గాయం కావడంతో జీజీహెచ్‌లో చేర్చారు. చికిత్స పొందుతూ మృతి చెందడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్సై భీష్మకుమార్ ఆదివారం తెలియజేశారు.

ఓట్ ఫర్ ఓపీఎస్ పోస్టర్ ఆవిష్కరణ

కాకినాడ సిటీ: ఓట్ ఫర్ ఓపీఎస్ అంటూ పాత పెన్షన్ పునరుద్ధరణ రాజకీయ ఎజెండా కావాలని ఆకాంక్షిస్తూ ఆదివారం ఉదయం కాకినాడ జిల్లా యుటీఎఫ్ కార్యాలయంలో ఆ నాయకులు పోస్టర్ ఆవిష్కరించారు. యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు, యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి టి.అన్నారాం, జిల్లా అధ్యక్షుడు కేవీవీ నగేష్, నాయకులు పాల్గొన్నారు.

యువ సాహితీ ప్రతిభా పురస్కారం

పిఠాపురం: సాహిత్య, సంగీత, సాంస్కృతిక, కళారంగాల్లో తాను చేసిన కృషికి యువ సాహితీ ప్రతిభా పురస్కారం లభించినట్లు పట్టణానికి చెందిన యువ కవి, సాహితీవేత్త డాక్టర్ కిలారి గౌరీనాయుడు ఆదివారం తెలిపారు. శనివారం విశాఖపట్టణంలోని అంకితం వెంకటనరసింగరావు ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ రాచకొండ నరసింహాశర్మ సాహితీ సంస్థ అధ్యక్షుడు ఎంఎస్ నాయుడు, ఉపాధ్యక్షురాలు కృష్ణకుమారిల చేతుల మీదుగా అవార్డు అందుకున్నానన్నారు.

ప్రభుత్వ పథకాలు ప్రజలకు వివరించాలి



త్రినాథరావును అభినందిస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రచార విభాగం కార్యదర్శి త్రినాథరావుకు అభినందన

కాకినాడ రూరల్: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదేళ్లలో ఎన్నికల మేనిఫెస్టోను పూర్తి స్థాయిలో అమలు చేసి నవరత్న సంక్షేమ పథకాలు పేదలకు అందించిందని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రచార విభాగం కార్యదర్శి, రమణయ్యపేట పంచాయతీ రాయుడుపాలేనికి చెందిన మీసాల త్రినాథరావును కన్నబాబు అభినందిచారు. రమణయ్యపేట వైద్యనగర్ క్యాంపు కార్యాలయం వద్ద ఆదివారం ఎమ్మెల్యే కన్నబాబును త్రినాథరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తనకు పదవి ఇచ్చిందుకు కృతజ్ఞత తెలియజేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు రాయుడు నాగేశ్వరరావు, మాచవరపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు స్వయం సమృద్ధి సాధించాలి

- ఎమ్మెల్సీ పద్మశ్రీ, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి



శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ పద్మశ్రీ, చంద్రకళాదీప్తి తదితరులు

కాకినాడ: స్వయం ఉపాధి అవకాశాలను మెరుగుపరుచుకోవడం ద్వారా ప్రతి మహిళ ఆర్థికాభివృద్ధి సాధించాలని ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి పిలుపునిచ్చారు. రాగిరెడ్డి వెంకట జయరామ్‌కుమార్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 44, 45, 46 డివిజన్లలోని మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ, మెహందీ, బేకరీ మేకింగ్, సబ్బుల తయారీ వంటి అంశాలపై ఆదివారం శిక్షణ ప్రారంభించారు. ఎమ్మెల్సీ పద్మశ్రీ మాట్లాడుతూ మహిళల సంక్షేమానికి మంచి ఆశయంతో చేపట్టిన ఇటువంటి సేవా కార్యక్రమాలు ఎంతో మందికి ప్రయోజనం కలిగిస్తున్నాయన్నారు. కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి మాట్లాడుతూ గడచిన రెండేళ్లలో వివిధ అంశాలపై ట్రస్ట్ ద్వారా సుమారు వెయ్యి మందికి శిక్షణ ఇచ్చామన్నారు. రానున్న రోజుల్లో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న అర్హత కలిగిన మహిళలందరికీ ట్రస్ట్ తరపున చేయూతనిస్తామని చెప్పారు. ట్రస్ట్ ప్రతినిధి రాగిరెడ్డి ఉష, మాజీ కార్పొరేటర్ బాలప్రసాద్, నాయకులు వాకాడ సత్తిబాబు, కిరణ్, ట్రైనర్ రమణి తదితరులు పాల్గొన్నారు.

పోటీ పరీక్షలపై అవగాహన సదస్సు



ఉచిత అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

కాకినాడ సిటీ: పీడీఎఫ్ ఎమ్మెల్సీల ఆధ్వర్యంలో గ్రూప్స్, డీవైఈవో పోటీ పరీక్షలకు ఆదివారం రాత్రి కాకినాడ అంబేడ్కర్ భవన్‌లో ఉచిత అవగాహన సదస్సు నిర్వహించారు. డీవైఈవో పోటీ పరీక్షలకు పీడీఎఫ్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు సారథ్యంలో గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ సదస్సు నిర్వహించారు. కేఎస్ లక్ష్మణరావు భారత సమాజం, ఆంధ్రుల చరిత్ర, ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ అనే అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఎమ్మెల్సీ లక్ష్మణరావు రూపొందించిన భారత సమాజం అనే స్టడీ మెటీరియల్‌ను ఉద్యోగార్థులకు ఉచితంగా అందించడానికి ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. ఆంధ్రుల చరిత్ర ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ అనే స్టడీ మెటీరియల్‌ను యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి టి.అన్నారాము, పూర్వపు కార్యదర్శి జి.ప్రభాకరవర్మ ఆవిష్కరించారు. రెండు గోదావరి జిల్లాల్లో గ్రూప్స్, డీఎస్సీ, సచివాలయం ఉద్యోగార్థులకు పీడీఎఫ్ ఎమ్మెల్సీల ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ అందించనున్నామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డీఎస్సీ, గ్రూప్స్ నోటిఫికేషన్లలో పోస్టులు పెంచాలని ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పలివెల వీరబాబు, యూటీఎఫ్ నాయకులు కేఎంఎంఆర్ ప్రసాద్, సీహెచ్ సూరిబాబు, ఏ సీతారామరాజు, రమణ, వరహాలు ఎస్ఎఫ్ఐ నాయకులు ఎంజీ సూరిబాబు, పీడీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శాంతియుత ఎన్నికలకు సహకరించండి



రాజకీయ పార్టీల నేతల సమావేశంలో మాట్లాడుతున్న సర్పవరం సీఐ శ్రీనివాస్

- బూత్ స్థాయి రాజకీయ నాయకులతో సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ సమావేశం

కాకినాడ రూరల్: శాంతియుతంగా ఎన్నికలు జరిగేలా సహకరించాలని బూత్ స్థాయిలో రాజకీయ పార్టీ నాయకులతో సర్పవరం సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ కోరారు. మండలంలో సర్పవరం, వాకలపూడి గ్రామాలలో పోలింగ్ స్టేషన్లు 86, 29 పరిధిలో ఆదివారం సాయంత్రం సమావేశాలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ, ఇతర పార్టీలు నాయకులు సమావేశానికి హాజరయ్యారు. సార్వత్రిక ఎన్నికల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ఎవరైనా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.